

# టేకిట్ ఈజీ!!

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

14

# ఎకానమీ కాగ్గోల

**పని రోజుల్లో పగలు** పదో గెంట కొట్టేదాకా పక్కే దిగబుద్ధవదు. అయినా ఎల్లాగో తంటాలు పడి శరీరాల్ని మంచం మీంచి లేపి, కడిగి, తుడిచి, సింగారించి పట్టికెళ్ళి ఆఫీస్సెట్లో కూలేసి, పది దాకా కునికి పాట్లు పడి ఆనక పని మొదలెడతాం గదా. అదే శనాదివారాలొచ్చేసరికి ఎవరో టెలిగ్రాం ఇచ్చి పిలిచినట్లు తెలివొచ్చేస్తుంది, ఆరుంపావు కల్లా. అప్పుడనగా లేచి ఏవిటి చెయ్యడం? చెక్కభజనా, నగర సంకీర్తనాను.

అందుకే చక్రవర్తి ఆ శనివారం పొద్దు మంచమ్మీదే అటూ ఇటూ దొర్లుతున్నాడు,

"నాకింకా తెలివి రావట్లేదు, నాకింకా తెలివి రావట్లేదూ.." అంటూ సెల్ఫ్ హిప్నోసిస్ చేసుకుంటూ.

"అవును మీకు తెలివి లేదు, రమ్మన్నా రాదు. నాకలాంటి భయాలేవీ లేవు. అయినా "తెలివేవిటి?" "తెలివి?" గోదావరి భాషా మీరూను. హాయిగా "మెలకువ" అనలేరూ, వెధవ "తెలివి" కాకపోతే.." అంటూ పక్కన కూర్చుని కుదపడం మొదలెట్టింది రాణి.

కాసేపు అటు తిరిగి ముడుచుకుపోయి గారం గుణిసాడు చక్రం. ఇట్నించి ఆవిడ కుదుపు అంతకంతకూ ఎక్కువైపోయింది. "ఒసేయ్, హార్లిక్స్ సీసాలో మజ్జిగలా వెన్నొచ్చేదాకా కుదిపి కుదిపి ఛంపేయకే, నీకున్న ఒక్కగానొక్క మొగుణ్ణి. కాసేప్పడుకోనీవే, అయినా ఇప్పుడేం కొంపలంటుకుపోయాయి, సెలవేగా.." అన్నాడు ప్రాధేయపడుతూ.

" అబ్బా, అదికాదండీ, ఇందాకా ఇండియానించి మా చెల్లాయి హేమ ఫోను చేసింది. ఇక్కడ మన ఎకానమీ మళ్ళీ పడిపోతోందిట. దేవుడు మేలుచేసి ఇవ్వాళ ఒఖ్ఖటంటే ఒకే రోజు బంగారం ధర కేజీకి పదిరూపాయలు తగ్గిందిట. ఏవైనా కొనుక్కునేదుంటే, ఇప్పుడే కొనేసుకోమంది, మనకి ఎంతలేదన్నా, హీనపక్షం ఓ వందరూపాయలదాకా మిగులుతాయి.." అంది ఆనందం పట్టలేక.

ఆవిడకేసి ఓ వెర్రి చూపు చూసి, ఒంట్లో శక్తినంతటినీ కూడ దీసుకుని లేచి " మనం సరిగ్గా పన్నెండొందలు మిగుల్చుకోవాలంటే ఎంత కొనాలో, దాంతో ఏవేం ఆభరణాలు చేయించుకోవచ్చో కరెక్టుగా ఆలోచించి లిస్టు తయారుచెయ్యి, ఈ లోపులో నేను దినచర్యలు ముగించుకునొస్తా.." అంటూ బాత్రూంలోకి గెంతేసాడు.

ఆవిడ "వందకి పదంటే, రెండొందలికి ఎంతమ్మా.." అని లెఖ్ఖలేసుకుంటూ, సావిట్లోకెళ్ళిపోయింది.

" హమ్మయ్య, ఇంక సాయంత్రం దాకా ఫ్రీ "అనుకుంటూ, పళ్ళుతోమి, కాఫీ తాగుతూ, సోఫాలో కూలబడి టీ.వీ ఆన్ చేసాడు. ఏ ఛానల్ పెట్టినా ఒకటే గోల. ఎకానమీ పడిపోతోందీ, ఉద్యోగాలూడిపోతున్నాయీ, ఇదే దిక్కుమాల్న సంత. కొంపతీసి తన ఉద్యోగం పీకేయరు కదా అని బెంగ మొదలైంది చక్రానికి. కాసేపటికి తనకి తనే ధైర్యం చెప్పుకున్నాడు "సోం వారం దాకా చచ్చినా పీకలేరు, సెలవలు కదా. ఈ 48 గెంటల్లో ఏదో ఒక తరుణోపాయం ఆలోచిద్దాం. ముందుగా సేవింగ్స్ ఎలా చెయ్యాలో ఓ ప్లాను వేద్దాం.. అనుకుంటూండగా ఫోను మోగింది.

"ఒరేయ్ ముఫ్ఫైవేలు లాసు" అన్నాడు శ్రీధరం.

"శుభం, ఎవరికి? ఎందులో?" అసహనంగా అన్నాడు చక్రం.

"నాకే. స్టాక్సులో ముఫ్ఫైవేలు గోవిందా, ఆ సునీల్ గాడి మాటవినడం వల్ల.." .

"దానికంత ఆనందంగా చెబుతావేం?" అడిగాడు చక్రం.

"అంటే మరి, సునీల్ గాడికి అరవైవేలు బొక్క పడిందిగా.." అన్నాడు ఆనందంగా.

"నిన్ను దేవుడుకూడా బాగు చెయ్యలేడు. నువ్వూ ఆ దరిద్రుడూ కలిసి కట్టకట్టుకుని చెట్టహూచీ నదిలో దూకండి.." అని ఫోను పెట్టేస్తుండగా..

"వురేయ్, వురేయ్, ప్లీజ్, నీకెంత దొబ్బిందో చెప్పవా, చెప్పవా.." అన్నాడు గారాలు పోతూ.

"నాకింకా అంత లాటరీ తగల్లేదు. నేనా దిక్కుమాలిన స్టాకులాడను. నెలజీతంలో ఏవన్నా మిగిలితే ఓ మసాలా దోశో, రెండు మిరపకాయ బజ్జీలో తింటాను. ఉంటాను.." ఠపీమని ఫోను పెట్టేసాడు చక్రం.

సేవింగ్స్ ఎలా చెయ్యాలో సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.

ఇంతలో రాణి వచ్చి " యేవండీ, నాదీ, పిల్లదీ అన్నీ అయిపోయినా, ఇంకా బోలెడంత బంగారం మిగిలిపోతోంది, పోనీ మీరేవన్నా చేయించుకుంటారా?" అడిగింది అమాయకంగా.

"కదా, నేనూ ఎగ్జాక్ట్లీ అదే ఆలోచిస్తున్నాను, సేం పించ్. నాకో కిరీటం, కవచ కుండలాలూ, కత్తీ, డాలూ చేయించు, యుద్ధానికెళ్ళేప్పుడు పనికొస్తాయి, వాటికెంతౌతుందో చూడు.." అని ఆవిణ్ణి పంపేసి, మళ్ళీ దీర్ఘాలోచనలో పడిపోయాడు "ఆదా, ఆదా, ఎలా, ఎలా.." అనుకుంటూ.

పశువుకి తిన్నది పుష్టి, మనిషికి ఉన్నది పుష్టి. తనిన్నాళ్ళూ మొదటిదే పాటించాడు. అసలు తనకి "ఉన్నది" ఏవిటా అని సుదీర్ఘంగా ఆలోచించి, అన్ని షేవింగ్సూ కలిపితే ఆరువేల మూడొందలు తేలింది లెఖ్ఖ. నెల ఖర్చులే ఐదువేలు. అంటే, తనకుద్యోగం లేకుండా ఒఖ్ఖటంటే ఒఖ్ఖనెల బతగ్గలవన్నమాట. ఆనక పరిస్థితి మరీ బేడ్‌గా కనిపించి, భయం పట్టుకుంది, లైఫు హరిశ్చెంద్ర నాటకంలో కాటిసీనైపోద్దేమోనని టెన్షను మొదలైంది. కాసేపు "ఇచ్చోటనే కదా, ఇచ్చోటనే కదా.." అని మొదలెట్టి, ఆపైన పద్యం గుర్తురాక, ఎందుకొచ్చిన సాహిత్యభయంలే అని ఇంకోలా భయపడడం మొదలెట్టాడు. ఆలోచించి ఆలోచించి చివరికి తెగించాడు. "ఆ, అందాకా వస్తే క్రెడిట్ కార్డులన్నీ గోకేసి, మొత్తం ఊడ్చేసి, మనదేశం పట్టుకుపోవడవే. కారు ఎయిర్‌పోర్టులో వదిలేసి, లోనిచ్చినవాడికి, ఆనక తీరిగ్గా ఓ ఈమెయిలివ్వడవే, ఎంతమంది చెయ్యలేదూ మనపీనుగులు..ఇల్లా ఆలోచిస్తూండగానే చిన్న కునుకు పట్టడం, దాంట్లో " ఓ బేంకు ఏజెంటూ, ఓ ఇంటర్‌పోల్ రక్షకభటుడూ ఇండియాలో తమ " 8 బై 21 మైనస్ 3 ఇంటూ 6 ఆబ్లిక్ 99 డేష్ 1234 " ఇంటి ఎడ్రస్‌కి వచ్చి, ఇంట్లో పనిమనిషితో సహా అందరికీ సంకెళ్ళు వేసి, మెడమీద ఇనపగుళ్ళు పెట్టి, కొరడాలతో కొడుతూ, నడకదారిన అమెరికా తీసుకెడుతూ.." .

ఇంక తట్టుకోలేక గబాల్న లేచిపోయాడు. అవును, హిప్పట్నించీ ఎల్లాగన్నా సేవింగ్స్ చెయ్యాలి, అదే తక్షణ కర్తవ్యం అనుకుంటూ ఆలోచనమొదలెట్టాడు.

చాలా తీవ్రంగా ఆలోచించిన మీదట అతనికి ఒకే ఒక్క అవకాశం కనిపించింది డబ్బు ఆదా చెయ్యడానికి. తను కొనే క్రడాయరు బ్రాండు మారిస్తే ఓ పదిడాలర్లు మిగల్చవచ్చని తట్టడంతో అతని టెన్షన్ కాస్త తగ్గింది. ఇంతలో వాళ్ళావిడ కొట్టుమీకెళ్ళి పాలట్టుకు రమ్మంది. సరే అని దగ్గరలో ఉన్న వెచ్చాలకొట్టుకెళ్ళాడు చక్రం. కొట్టుబైట ఒక శాల్తీ తగిలాడు.

చక్రాన్ని ఎగాదిగా చూసి " మీరు తెలుగువాళ్ళా?" అన్నాడు.

చక్రవర్తి ఆ ప్రశ్నకి ఉబ్బి తబ్బిబ్బైపోతూ "నో, నోహో, మాది హైదరాబాదు.." అన్నాడు గర్వంగా. "మరదే సరసవంటే, ఏంటి పొద్దున్నే ఊపుకుంటూ బయల్దేరావు, పాలకేనా ?"

" అవును "పాలకేనే" కొనాలి, అయినా నీకెందుకు మజ్జెలో?" అన్నాడు చిరాగ్గా.

"మరి ఇలా కర్సుపెడితే కరుసైపోతావు. కానీ కర్సుకాకుండా కాఫీలోకి పాలుకొట్టేసే టెక్నిక్ చెప్పనా?" అన్నాడు ఊరిస్తూ.

చక్రవర్తి కాస్తా పీనాసి చక్రవర్తి ఐపోయి "చెప్పవా చెప్పవా, ప్లీజ్, ప్లీజ్..." అన్నాడు ముద్దుగా.

"లడ్డుబుడ్డు, నేనినేనినేనే, నేనినేనినేనే..." అంటూ ముక్కుమీద బటనవేలెట్టుకుని నాలిక బైటికి తీసి ఎక్కిరించి పారిపోతూ "రేప్పొద్దున్న ఆరింటికి మెయిన్ రోడ్డుమీద మెక్‌డోనాల్డ్స్‌కి రా..." అనేసి వెనక్కి తిరిగి చూడకండా పారిపోయాడు.

చక్రవర్తి పాలుకొనకండా ఇంటికెళ్ళిపోయాడు. మర్నాడాదివారం ఉదయాన్నే లేచి, నాలిక కాఫీకోసం పీకుతున్నా పట్టించుకోక, జెర్కిన్ తగిలించి ఆ మెక్‌డోనాల్డ్స్ ముందు హాజరయ్యాడు. అప్పటికే అక్కడ ఆ చుట్టుపక్కల సబ్‌డివిజన్లలో ఉండే సింగరాజు లింగరాజులంతా రెడీగా ఉన్నారు. అందరూ తలో పదిసెంట్లూ పోగేసి నిన్న కనిపించిన పిచ్చోడికిచ్చారు. వాడు రెండ్రూపాయలుచ్చుకుని లోపలికెళ్ళి సింగిల్ కాఫీ కొని, పక్కనే పెట్టిన చిన్న చిన్న పాల కప్పులు ఓ ఇరవై, పంచదార పేకెట్లు ఓ నలభై జేబులో వేసుకుని దర్జాగా బైటికొచ్చేసి అందరికీ తలా ఒక పాల కప్పూ, రెండు పంచదార పేకెట్లూ ఇచ్చేసాడు. చక్రవర్తి నిలువెల్లా చలించిపోయాడు ఆ టెక్నిక్ చూసి.

"మరీ ఈ సుత్తి కప్పెం సరిపోతుంది, ఇద్దరు మనుషులకి?" అన్నాడు నసుగుతూ.

"అందుకే మనం ఇంకా ఇలా మరో నాలుగు దుకాణాల కెళ్తాం, కొన్నిచోట్ల సింగిల్ కాఫీ కొంటాం, కొట్టు వాళ్ళు బిజీగా ఉంటే అదీ కొనం , జస్ట్ రెస్ట్‌రూం వాడుకుని, పాలపేకెట్లు తీసుకుని వచ్చేస్తామన్నమాట. " అన్నారు అందరూ ముక్తకంఠంతో.

" మరి డికాషనూ? " అన్నాడు చక్రవర్తి అనుమానంగా.

"మరదే, మనం కొన్న కాఫీ ఉంటుందికదా, అది ఫిల్లర్‌తో అందరికీ సమంగా పంచేస్తాం. ఇంటికెళ్ళి దాన్లో నీళ్ళుకలుపుకుని కుమ్మేయడవే..." అన్నారు మళ్ళీ అదే ముష్టికంఠంతో, ఐమీన్..ముక్తకంఠంతో.

ఇంక తట్టుకోలేకపోయాడు చక్రవర్తి. ముష్టి కాఫీ కోసం మాదాకోళం వాళ్ళలా నాలుగైదు కొట్లలో పాలు, పంచదార పట్టుకొస్తేనే గానీ పూటగడవనంత స్థితిలో తనులేడని పించింది. అందుకే వాళ్ళెంత కన్విన్సు చేసినా టెంప్ట్ అవకుండా వచ్చి కారెక్కేస్తూంటే ఎవడో నడుస్తూ వచ్చి గుద్దేసాడు.

"మేన్, కాన్ట్ యూ సీ.." అని అరుస్తూంటే, ఆ జుట్టుపోలిగాడు అతి కష్టం మీద తన మొహమ్మీది జుట్టు రెండుభాగాలు చేసి, కుడివైపుకీ, ఎడంవైపుకీ లాగి,

"సారీ, నౌ ఐ కెన్ సీ, వొరేయ్ చక్రం నువ్వా.." అన్నాడు నవ్వుతూ.

చక్రం ఆ శాల్తీని పరీక్షగా చూసి..."వా..ౕరే..య్, వీరేషూ.. నువ్వేంౕటా ఇలా, పిల్లల్నెత్తుకుపోయేవాడిలా ఈ జుట్టూ, జునపాలూ..?" అన్నాడు ఆందోళనగా.

**"ఎకానమీ బాసూ, ఏడాదికోసారే క్షవరమని డిసైడైపోయాను.."** అన్నాడు వాడు స్థిరంగా.

**"నీ ఖర్మ"** అని కారెక్కేసి కొట్టుకెళ్ళి పాలుకొనుక్కుని కౌంటర్ దగ్గిరికొచ్చేసరికి కనబడ్డాడు గోవింద్ , నున్న గుండుతో. చక్రవర్తి వాణ్ణి విష్ చేసి,

**"సారీరా, ఇంత ఘోరం జరుగుతుందని అనుకోలేదు, దేవుడెప్పుడూ మంచివాళ్ళనే త్వరగా తీసుకెళిపోతాడు.."** అంటూంటే, గోవింద్ అడ్డుకుని..

**"అర్థం కాలే.."** అన్నాడు మొహం కొచ్చెనుమార్కులా పెట్టి.

**"అదేరా, నాన్నగారు..."** అని ఆగాడు చక్రం. అప్పుడు వెలిగింది గోవింద్ కి.

**"ఓరినీయయ్య, మా అయ్యకేవీ కాలేదు, ఐఫిల్ టవరులా చెక్కుచెదరకుండా ఉన్నాడు. "** అన్నాడు కోపంగా.

**"మరా గుండు?"** అడిగాడు అనుమానంగా చక్రవర్తి.

**"ఎకానమీ.. ఆర్నెల్ల కోసారే క్షవరం"** అనేసి వెళ్ళిపోయాడు గోవింద్.

ఇంక తట్టుకోలేకపోయాడు చక్రవర్తి. ఇంటికొచ్చినప్పటినించీ ఎల్లా పొదుపు చేయాలా అనే విషయం మీద తెగ కిందామీదా పడిపోతున్నాడు. క్రడాయర్ స్కీం తప్ప గత్యంతరం కనబడటం లేదు. అంతలో మెయిల్‌లో వచ్చే ముష్టిన్నర ముష్టి కూపన్లలో ఒకటి అతనిని అయస్కాంతంలా లాగేసింది.

**"మీక్కావలసినట్టుగా క్షవరం చేయబడును, కేవలం రెండు డాలర్లు మాత్రమే, ఈ మహత్తర అవకాశం ఈ ఆదివారం మాత్రమే. "** అంటే, ఏకంగా పద్ధెనిమిది డాలర్ల ఆదానే. ఐబాబోయ్... ఈ అవకాశం వదలనేకూడదు, అనుకుంటూ రెండునిముషాల్లో ఆ వీరముష్టి సెలూన్‌లో ప్రత్యక్షమయ్యాడు. వెళ్ళడవే తడువు ఓ శంకిణి వచ్చి అమాంతం ఓ కుర్చీలో కూలేసి

**"చికా చుకీ చికి చికీ కిచ కిచ కిచా?"** అంది పరధ్యానంగా.

**" అబ్బే, ఇప్పుడలాంటి ఫార్మాలిటీస్ ఏవీ వద్దండీ, ఇంట్లో ఆల్‌రెడీ బ్రేక్ ఫాస్టు చేసొచ్చాను. జస్ట్ హెయిర్ కట్ చాలు.."** అన్నాడు ఇబ్బందిగా.

**"ఓ హెయిల్ కట్, లాంగ్ ఆల్ షార్ట్? "** అడిగింది చిరాగ్గా.

**"అంటే...మీడియం ఈజ్ బెటర్ అన్నమాట.."** అన్నాడు వినయంగానే.

**"మీలియం. ఓకే."** అని ఎవరికో ఫోన్ చేసి

**"కిచ కిచ చిక చిక మీలియం చుకీ చికి చికి చికీ.."** అంటూ ఏదో చెప్పింది. మరునిముషంలో ఆరుగురు ట్రెయినీ కుర్రాళ్ళు ప్రత్యక్షమయ్యారు. ఒకడు లోపల్నించి ఓ గుడ్డ తీసుకొచ్చి మొహమ్మీద కప్పేసాడు. వెంటనే ఆ శంకిణి..

**"నో నో నో ఫేస్, ఓన్లీ బాలీ, కవల్ ద బాలీ.."** అంటూ తువ్వాలు ఎలా కప్పాలో వాళ్ళకి చూపించింది. వాళ్ళు అందరూ నోటుబుక్కు తీసి బొమ్మ గీసుకున్నారు. ఆనక వాళ్ళలో కాస్త క్రూరంగా ఉన్నవాడు ఓ కత్తెర దూసి మీదకొచ్చాడు. ఎందుకైనా మంచిదని వాళ్ళకి తెలీకుండా చక్రవర్తికూడా ఓ కత్తి కుడిచేతిలో పట్టుకుని రెడీగా ఉన్నాడు, కనీసం అడ్డుపెట్టుకోవచ్చుకదా అని ముందుచూపుతో. వాడు సరాసరి వచ్చి చెవిమీద గుచ్చాడు, **"కెవ్వు"** మన్నాడు చక్రం. మళ్ళీ ఆ శంకిణి వచ్చి.. **"నో ఇయల్ కట్, జస్ట్ హెయిల్ కట్..."** అంటూ వాడి దగ్గరనించి కత్తెర లాక్కుని, మచ్చుకి రెండు వెంట్రుకలు కట్ చేసి...

**"నౌ యూ ట్రై.."** అంటూ ఇంకో ట్రెయినీ గాడికిచ్చింది. వాడు మహదానంద పడిపోతూ, పరపరా అందినంత మేర కోసిపారేసాడు.

**"మై టల్న్, మై టల్న్.."** అంటూ మిగిలిన వాళ్ళు గారాలుపోయి తమ ముచ్చటకూడా తీర్చుకున్నారు. ఓ గంట పోయాకా మళ్ళీ స్పృహలోకొచ్చాడు చక్రం. కానీ అప్పటికే అతని క్రాపు అప్పనపల్లి రోడ్డులా అరవైఎనిమిది గుంటలతో ఎగుడు దిగుడుగా, అస్తవ్యస్తంగా తయారైంది. అద్దంలోచూసుకున్న చక్రానికి బుర్ర తిరిగిపోయింది. ఇలా బైటికెళ్తే కుక్కలు వెంట పడడం ఖాయం, అనుకుంటూ, విధిలేక, వాళ్ళకే మరో ఇరవై డాలర్లు సమర్పించి, నున్నగా కొట్టించుకుని ఇంటికొచ్చాడు. తలుపు తియ్యగానే మొదలెట్టింది వాళ్ళావిడ

**"బాధపడకండి, దేవుడెప్పుడూ మంచివాళ్ళనే..".** వెంఠనే ఆవిడ నోరుమూసేసి తలుపేసేసాడు చక్రం. ఆరోజునించీ మళ్ళా సేవింగ్ మాటెత్తా లేదు, ఎకానమీ కాకుల గోల వినాలేదు.

